పింఛన్లపై ఆందోళన వద్దు


పెన్షన్ కోసం దిగులు చెందవద్దని వృద్ధురాలికి ధైర్యం చెబుతున్న కె.కె.రాజు

- చంద్రబాబు కుటిల రాజకీయాలతోనే ఆటంకం
- వైఎస్సార్‌సీపీ 'ఉత్తర' ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు
- ఎన్నికల్లో గెలిచి ఇళ్ల వద్దే పెన్షన్ అందిస్తామని భరోసా


వెంకటేశ్వర కాలనీలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు

సీతంపేట: పెన్షన్ల పంపిణీపై ఎవరూ ఆందోళన చెందవద్దని, ఎన్నికల అనంతరం మళ్లీ ఇంటి వద్దే వలంటీర్లు పింఛన్ డబ్బులు అవ్వాతాతలకు అందజేస్తారని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు భరోసా ఇచ్చారు. మార్నింగ్ వాక్‌లో భాగంగా సోమవారం 43వ వార్డు వెంకటేశ్వర కాలనీలో కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కె.కె.రాజును స్థానిక పింఛన్‌దారులు కలిసి తమకు పెన్షన్ డబ్బులు అందలేదని మొరపెట్టుకున్నారు. ఆయన మాట్లాడుతూ కొంతమంది నాయకుల కుట్రపూరిత రాజకీయాలతో పెన్షన్ పంపిణీపై సందిగ్ధత నెలకొందని, వలంటీర్లపై కక్ష పెంచుకున్న టీడీపీ అధినేత చంద్రబాబు పెన్షన్ డబ్బులు పంపిణీ చేయడానికి వీల్లేదని ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు చేయడంతో ఇబ్బంది ఏర్పడిందని చెప్పారు. చంద్రబాబు అండ్ కో కుటిల రాజకీయాలను రానున్న ఎన్నికల్లో తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో గెలిచి తిరిగి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే జూన్ 4 నుంచి లబ్ధిదారుల గడప వద్దకే పెన్షన్ చేరుతుందని ధైర్యం చెప్పారు. స్థానిక ప్రజలతో కాసేపు ముచ్చటించారు. ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటేసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని, తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కె.కె.రాజు కోరారు. కార్యక్రమంలో వీకేపీసీపీఐఆర్ చైర్మన్, ఉత్తర ఎన్నికల పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావు, సీనియర్ నాయకులు పైడి రమణ, దుప్పలపూడి శ్రీను, గంగామహేష్, ఠాగూర్, సూరాబత్తుల తిరుపతి, బైరా వెంకట్, బాద శ్రీనివాస్, సిర్రా లక్ష్మణ్, కంచు పద్మశేఖర్, మట్టా రాణి, బంగారమ్మ, గరికి రమ, నరసయ్య, రంజాన్ వల్లి, ఎం.గోపి, హరిపట్నాయక్, రమణారెడ్డి, నేతల కుమార్, బి.గోవింద్, అంబటి శైలేష్, ఎం.సునీల్, బొట్టరాజు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

మద్దిపాలెం: వైఎస్సార్‌సీపీ 50వ వార్డు నాయకులు ఏపీఎన్ రాజు, సనపల నారాయణస్వామి, కంచరాన రాజేశ్వరరావు, సనపల రమేష్, సనపల సుమతి సోమవారం వార్డులోని లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్ల పంపిణీ విషయమై మూడు నెలలు ఓపిక పట్టాలని ధైర్యం చెప్పారు.

దుష్టశక్తులను తరిమికొట్టే బాధ్యత ప్రజలదే


51వ వార్డులో రెయ్యి వెంకటరమణతో కలిసి పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కె.కె.రాజు. చిత్రంలో చొక్కాకుల, బాణాల, సనపల

మద్దిపాలెం: రాష్ట్రాన్ని పట్టి పీడిస్తున్న దుష్టశక్తులను తరిమికొట్టే రోజు వచ్చిందని, ఆ బాధ్యత ప్రజలదేనని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు అన్నారు. 51వ వార్డు కళింగనగర్‌లో కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పార్టీ ఎన్నికల కార్యాలయాన్ని సోమవారం ముఖ్య అతిథిగా ఆయన ప్రారంభించి మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే ప్రజలు ఆర్థికంగా ఎదిగేందుకు సాధ్యపడిందన్నారు. టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి నాయకులు కేవలం ఎన్నికల సమయంలోనే ప్రజల్లోకి వస్తారని, అప్పుడే వారికి ప్రజలు గుర్తుకొస్తారని, అప్పటి వరకు కనీసం ఎక్కడున్నారో కూడా తెలయదని అసహనం వ్యక్తం చేశారు. సీజనల్ వ్యాధులు లాగానే, ప్రతిపక్షనేతలు కూడా కేవలం సీజన్‌లోనే ప్రజల వద్దకు ఓట్లు అడగడానికి వస్తారని ఎద్దేవా చేశారు. ప్రజలకు నేరుగా ఓటు వేయమని అడిగే హక్కు సీఎం వైఎస్ జగన్ తమకు కల్పించారన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం నిత్యం కష్టపడుతున్న ముఖ్యమంత్రి జగన్‌ను అత్యధిక మెజారిటీతో మళ్లీ గెలిపించాలని కె.కె.రాజు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వీకేపీసీపీఐఆర్ చైర్మన్, ఉత్తర ఎన్నికల పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావు, వీఎంఆర్‌డీఏ చైర్మన్ సనపల చంద్రమౌళి, ఉత్తర ఎన్నికల పరిశీలకుడు, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, పశ్చిమ ఎన్నికల పరిశీలకురాలు పేడాడ రమణికుమారి, జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, 49వ వార్డు కార్పొరేటర్ అల్లు శంకరరావు, కార్పొరేటర్లు వావిలపల్లి ప్రసాద్, సారిపిల్లి గోవింద్, బర్కత్ అలీ, శశికళ, పార్టీ 53వ వార్డు అధ్యక్షుడు గుజ్జు వెంకటరెడ్డి, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ పైడి శ్రీనివాసరావు, 51వ వార్డు సీనియర్ నాయకులు, మహిళా నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

సీతంపేట: సీతమ్మధార సబ్ డివిజన్, సీతంపేట 11 కేవీ ఫీడర్ పరిధిలో 132 కేవీ టవర్ లైన్ల మార్పు నిమిత్తం మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఈఈ బి.సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు గురుద్వారా, సీతంపేట మెయిన్ రోడ్డు, దుర్గాగణపతి ఆలయం ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోదారులు గమనించాలని కోరారు.

7న నేత్ర వైద్య శిబిరం

మురళీనగర్: మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 7న మురళీనగర్ రామాలయం సమీపంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షురాలు ఎస్.లలితారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీమాధవ యువజన సమాజం సహకారంతో శంకర్ ఫౌండేషన్ సౌజన్యంతో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శిబిరం జరుగుతుందన్నారు. మురళీనగర్, మాధవధార, కళింగనగర్, వంశీనగర్ కాలనీల వాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

వాకర్ రమణయ్య మృతికి సంతాపం

మురళీనగర్: వాకర్స్ క్లబ్ సీనియర్ సభ్యుడు, రిటైర్డ్ రైల్వే డివిజనల్ ఇంజినీర్ ఎస్వీ రమణయ్య(84) మృతికి వాకర్స్ క్లబ్ కమిటీ సభ్యులు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. రమణయ్య సోమవారం ఉదయం మృతిచెందారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి, ఇతర కార్యవర్గ సభ్యులు ఆకాంక్షించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు.

వ్యక్తి అదృశ్యం


కొనపల సూర్యనారాయణ

మద్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి అదృశ్యమైనట్టు ఫిర్యాదు అందింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. కొనపల సూర్యనారాయణ భార్య, పిల్లలతో కలిసి ఐటీఐ జంక్షన్ సిద్ధార్థనగర్‌లో నివసిస్తున్నాడు. ఇతను ఇండస్ట్రియల్ ఎస్టేట్ వద్ద ఓ బేకరీలో పనిచేస్తుంటాడు. గత నెల 29న ఉదయం 7.30 గంటల సమయంలో డ్యూటీకి వెళ్తానని చెప్పి.. ఇంటి నుంచి వెళ్లాడు. రాత్రయినా తిరిగి రాకపోవడంతో బేకరీ వద్దకు వెళ్లి కనుక్కున్నారు. అతడు ఆరోజు పనికి రాలేదని వారు బదులిచ్చారు. కుటుంబ సభ్యులు అంతటా వెతికినా ప్రయోజనం లేకపోవడంతో సోమవారం సూర్యనారాయణ భార్య కొనపల మణి పోలీసులు ఫిర్యాదు చేశారు. సీఐ ఎస్.భాస్కరరావు నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ బి.నరసింహమూర్తి కేసు దర్యాప్తు చేపట్టారు.

నగరంలో ముమ్మర తనిఖీలు


రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల లగేజీలను డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేస్తున్న సెబ్ సిబ్బంది

తాటిచెట్లపాలెం: సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా నగరంలో తనిఖీలు ముమ్మరం చేశారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ బి.శ్రీనివాసరావు ఆదేశాలతో సెబ్ అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ సుబ్బారావు ఆధ్వర్యంలో సోమవారం విశాఖపట్నం రైల్వేస్టేషన్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో సెబ్ సిబ్బంది రాజుల నాయుడు, ముసలనాయుడు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్రెండ్‌షిప్ కప్ విజేత డాల్ఫిన్ డ్యాన్స్

దాబాగార్డెన్స్: ఫ్రెండ్‌షిప్ కోసం మూడు రోజులుగా విశాఖ రైల్వే గ్రౌండ్స్‌లో నిర్వహించిన విశాఖ కళాకారుల క్రికెట్ టోర్నమెంట్‌లో క్యాలు జనార్దన్ కెప్టెన్సీలోని డాల్ఫిన్ డ్యాన్స్ జట్టు విజేతగా రెండోసారి ట్రోఫీ గెలుచుకుంది. రన్నరప్‌గా అజ్గర్ అలీ కెప్టెన్సీలో సింహగిరి 11 నిలిచింది.

పరస్పర విజయానికి సహకారం


వాసుపల్లి గణేష్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు

దాబాగార్డెన్స్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఉత్తర నియోజకవర్గంలోని మద్రిపాలెంలో ఉంటున్న వైఎస్సార్‌సీపీ దక్షిణ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్‌కు ఆ పార్టీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు ఓటు అభ్యర్థించారు. సోమవారం పార్టీ ఉత్తర నియోజకవర్గ శ్రేణులతో వాసుపల్లిని కె.కె.రాజు కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఉత్తరలో స్థానిక ఓటర్ల అభ్యర్థనలో సహకరించాలని ఆయనను కోరారు. దక్షిణ నియోజకవర్గంలో మీరు చేస్తున్న సేవలకు విజయఢంకా మోగడం ఖాయమన్నారు. ఉత్తర నియోజకవర్గంలో తనకు సహకారం అవసరమని కె.కె.రాజు తెలిపారు. గణేష్‌కుమార్ మాట్లాడుతూ ఉత్తరలో తప్పకుండా కె.కె.రాజు ఎమ్మెల్యేగా విజయం సాధిస్తారన్నారు. ఉత్తర టీడీపీ ఎమ్మెల్యే కనీసం ప్రజలకు మోహం కూడా చూపించలేదన్నారు. అతి తక్కువ మెజార్టీతో గత ఎన్నికల్లో ఓడినప్పటికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయంతో ఉత్తర నియోజకవర్గంలో కె.కె.రాజు చేసిన అభివృద్ధికి ప్రజలు తప్పకుండా ఎన్నికల్లో గెలిపించుకుంటారని వాసుపల్లి పేర్కొన్నారు. కె.కె.రాజు వెంట పలువురు ఉత్తర నియోజకవర్గ నాయకులు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన బర్మా కాందిశీకులు


ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన బర్మా కాందిశీకులు

సీతంపేట: జీవీఎంసీ 49వ వార్డు బర్మా క్వార్టర్స్‌కు చెందిన బర్మా కాందిశీకుల సంక్షేమ సంఘం నాయకులు, సభ్యులు, నూకాంబిక మహిళా మండలి సభ్యులు 30 మంది స్వచ్ఛందంగా వైఎస్సార్‌సీపీలో చేరారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయంలో వీరికి ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రతి ఒక్కరూ సమష్టిగా పని చేసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలన్నారు. వైఎస్ జగన్ గడపగడపకూ అందించిన సంక్షేమం, ప్రతి వార్డులో చేపట్టిన అభివృద్ధిని చూసి ఆకర్షితులమై స్వచ్ఛందంగా పార్టీలో చేరినట్టు సంఘం నాయకులు, సభ్యులు తెలిపారు.

కత్తితో దాడి చేసిన నిందితుల అరెస్ట్


పిల్లా గోవింద్


కొత్తకోట లోకేష్ గణేష్


వొప్పంగి అనిల్‌కుమార్

మద్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో కప్పరాడకు చెందిన ముగ్గురు యువకులను కత్తితో బెదిరించి దాడికి పాల్పడ్డ అదే ప్రాంతానికి చెందిన ముగురు నిందితులను సోమవారం పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రధాన నిందితుడు పిల్లా గోవింద్‌పై గతంలో ఓ కేసు కూడా ఉంది. ఇతడితోపాటు కొత్తకోట లోకేష్ గణేష్, వొప్పంగి అనిల్‌కుమార్ అనే ఇద్దరు వ్యక్తులు దివ్యతేజ, మహేష్, మదన్‌తో ఆదివారం రాత్రి కంచరపాలెం కప్పరాడ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద వాగ్వాదానికి దిగి, ఘర్షణ పడ్డారు. వెంటనే గణేష్ సమీపంలోని నూడిల్స్ అమ్ముతున్న బండిలో నుంచి కత్తి తీసి బాధితులను గాయపరిచడమే కాకుండా కులం పేరుతో దూషించాడని సీఐ ఎస్ భాస్కరరావు తెలిపారు. ముగ్గురు నిందుతులని సోమవారం అదుపులోకి తీసుకుని విచారించి అరెస్ట్ చేశామని చెప్పారు. ప్రధాన నిందితుడు గణేష్‌పై రౌడీషీట్ కూడా తెరుస్తామన్నారు.బాధితుడు దివ్యతేజ ఫిర్యాదుతో ఏసీపీ స్థాయిలో విచారించి, కేసు దర్యాప్తు చేశారని పేర్కొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలే..: వెస్ట్ ఏసీపీ హెచ్చరిక

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని వెస్ట్ సబ్ డివిజన్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి హెచ్చరించారు. రౌడీషీటర్లు ఎటువంటి అల్లర్లు సృష్టించినా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా చర్యలు తప్పవన్నారు. ఎల్లప్పుడూ పోలీస్ నిఘా ఉంటుందని గుర్తుంచుకుని మెలగాలన్నారు. శాంతిభద్రతలకు భంగం కలిగేలా ప్రవర్తిస్తే ఊరుకునేది లేదని, మద్యం షాపుల వద్ద గొడవలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సింగిల్ మేజర్ సబ్జెక్టులపై అధ్యాపకులకు శిక్షణ

దాబాగార్డెన్స్: కమిషనర్ ఆఫ్ కాలేజీయేట్ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు నోడల్ రీసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో సోమవారం విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సింగిల్ మేజర్ సబ్జెక్ట్స్‌పై ఐదు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల మాట్లాడుతూ సింగిల్ మేజర్ సబ్జెక్టుల్లో భాగంగా హిస్టరీ, పొలిటికల్ సైన్స్‌కు సంబంధించి జిల్లాలోని అధ్యాపకులు శిక్షణ తరగతుల్లో పాల్గొన్నారని చెప్పారు. అధ్యాపకులు నూతన విద్యా విధానం, పరిశోధనలు వంటి వాటికి సంబంధించి నూతన పోకడలు తెలుసుకుని వినూత్నంగా విద్యను అందించాలని, విద్యార్థుల నైపుణ్యతకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఆర్‌సీ కో ఆర్డినేటర్ డాక్టర్ కె.ఎల్.శిరీష, రీసోర్స్ పర్సన్స్ డాక్టర్ వై.రమేష్‌బాబు, బి.రాజు, వి.పల్లవి, కె.చక్రవర్తి, డాక్టర్ జి.కిరణ్‌కుమార్, ఎం.కొండలరావు, ఎ.శ్రీవాణి, జేకేసీ మెంటార్ డి.ప్రజ్ఞ జిల్లాలోని అధ్యాపకులు పాల్గొన్నారు.


శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులతో మాట్లాడుతున్న మహిళా కళాశాల ప్రిన్సిపాల్ మంజుల

పాలిటెక్నిక్‌తో ఉద్యోగావకాశాలు


పాలిసెట్ ఉచిత శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ నారాయణరావు

మురళీనగర్: పదో తరగతి అనంతరం పాలిటెక్నిక్ విద్యను అభ్యసించిన వారికి విస్తృతమైన ఉద్యోగావకాశాలు ఉన్నాయని కంచరపాలెం పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు అన్నారు. కాలేజీలో నిర్వహిస్తున్న పాలిసెట్ ఉచిత శిక్షణ తరగతులను సోమవారం ఆయన ప్రారంభించిన అనంతరం ప్రసంగించారు. పాలిటెక్నిక్ పూర్తి కాగానే కనీస రూ.3.50 లక్షల వార్షిక ప్యాకేజీతో ఉద్యోగాలు వస్తాయన్నారు. వీరు ఈసెట్ రాసి నేరుగా ఇంజినీరింగ్ రెండో సంవత్సరం కోర్సులో చేరవచ్చని వివరించారు. విద్యార్థులు శిక్షణ తరగతులకు ప్రతి రోజు హాజరై మంచి ర్యాంకులు సాధించాలని ఆయన సూచించారు. శిక్షణ తరగతులకు 165 మంది హాజరయ్యారు. వీరిలో 72 మంది బాలికలు ఉన్నారు. మొత్తం విద్యార్థులను రెండు బ్యాచీలుగా విభజించి కోచింగ్ ఇస్తున్నట్లు శిక్షణ తరగతులు పర్యవేక్షకుడు, జనరల్ సెక్షన్ హెడ్ డాక్టర్ పీఎం బాషా చెప్పారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

తళుక్కుమనేలా రహదారులు


నార్త్ ఎక్స్‌టెన్షన్‌లో అద్దంలా డబుల్ రోడ్డు

సీతమ్మధార: జీవీఎంసీ జోన్–3 పరిధి 14వ వార్డులో సుమారు రూ.2.5 కోట్లతో నిర్మించిన రహదారులు తళుక్కుమంటున్నాయి. సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని ఎస్ఎఫ్ఎస్ స్కూల్ వెనుక గల డబుల్ రోడ్డు నేషనల్ హైవే తరహాలో కనిపిస్తోంది. ఇక్కడి అందమైన రోడ్లను చూసి వాహన చోదకులు ముచ్చటపడుతున్నారు. రోడ్లు బాగోలేవన్న వారంతా నేడు అద్భుతంగా నిర్మించారని హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో అధ్వానంగా తయారైన రహదారులు.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అద్దంలా మెరుస్తున్నాయి. 14వ వార్డులో చక్కని రోడ్లు నిర్మించారని స్థానికులు, వాహన చోదకులు, పాదచారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

జ్ఞానాపురం యూపీహెచ్‌సీని సందర్శించిన డీఎంహెచ్‌వో


ఆరోగ్య కేంద్రంలో సిబ్బందికి సూచనలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు సోమవారం జ్ఞానాపురం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని(యూపీహెచ్‌సీ) సందర్శించి, వైద్య సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓపీల సంఖ్య ఇంకా పెంచాలని, సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. మందులు, వ్యాక్సిన్ నిల్వ చేయడానికి ఫ్రిడ్జ్‌ను ఉపయోగించాలని, టెంపరేచర్ ఎప్పటికప్పుడు నమోదు చేయాలని చెప్పారు. అనంతరం ఆస్పత్రిలోని ఫార్మసీ యూనిట్‌లో మందులు, బ్యాచ్ నంబర్లను డీఎంహెచ్‌వో పరిశీలించి, ఎక్స్‌పైర్ తేదీలను నమోదు చేసుకోవాలన్నారు. స్టోర్స్ బుక్, రిపోర్ట్స్, రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలని సిబ్బందికి సూచించారు. దీనిమీద సరైన సూపర్‌వైజింగ్ చేయాలని వైద్యాధికారి, పర్యవేక్షణ అధికారులను డీఎంహెచ్‌వో ఆదేశించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బాలాజీ, ఎపిడిమిక్ సెల్, పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వసతి గృహాలకు మహర్దశ


సీతమ్మధారలో కళాశాల విద్యార్థుల వసతి గృహం


అభివృద్ధి చేసిన బాలుర వసతి గృహం–2


విద్యార్థుల చేతుల శుభ్రతకు ఏర్పాటు చేసిన వాష్ బేసిన్

- అద్భుతంగా మారిన సాంఘిక సంక్షేమ శాఖ హాస్టళ్లు
- రూ.53.10 లక్షలతో అభివృద్ధి.. మౌలిక సదుపాయాల కల్పన
- సంతోషం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

సీతమ్మధార: రాష్ట్ర ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సీతమ్మధారలో నిర్వహిస్తున్న బాలుర వసతి గృహాలకు మహర్దశ పట్టింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మునుపెన్నడూ లేనివిధంగా ఈ హాస్టళ్లను అద్భుతంగా అభివృద్ధి చేశారు. విద్యార్థుల కోసం అన్ని రకాల సదుపాయాలు కల్పించారు. 1975లో సీతమ్మధార టీపీటీ కాలనీలో ప్రీమెట్రిక్ వసతి గృహాన్ని నాటి కేంద్ర యూనియన్ డిప్యూటీ మినిస్టర్ జి.వెంకటస్వామి, రాష్ట్ర హరిజన, గిరిజన వెల్ఫేర్ మంత్రి బట్టం శ్రీరామమూర్తి ప్రారంభించారు. 2008లో డా.బాబు జగ్జీవన్ రామ్ కాలేజ్ బాయ్స్ హాస్టల్‌ను ఓపెన్ చేశారు. కొన్నేళ్ల పాటు అవి బాగానే నడిచాయి. కాలక్రమేణా బాలుర వసతి గృహం–2తోపాటు కళాశాల హాస్టల్ మరుగుదొడ్లు పాడై, ఫ్యాన్లు తిరగక, మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడేవారు.

ప్రభుత్వ సహకారంతో సుందరీకరణ

సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రామారావు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జునను కోరగా.. స్పందించిన ఆయన హాస్టళ్ల అభివృద్ధికి చర్యలు చేపట్టారు. 15వ లోకసభ ఎంపీ ల్యాడ్స్ ఫండ్ ద్వారా బాలుర వసతి గృహాన్ని రూ.15.50 లక్షలతో, కళాశాల హాస్టల్‌ను రూ.37.60 లక్షలతో ఆధునీకీకరించి మౌలిక సదుపాయాలు కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో వసతి గృహాలను సుందరీకరించారు. ప్రస్తుతం ఈ రెండు హాస్టళ్లలో వివిధ ప్రాంతాలకు చెందిన 122 మంది విద్యార్థులు ఉంటూ చదువుకుంటున్నారు. వసతి గృహాలను అందంగా తీర్చిదిద్ది సకల సదుపాయాలు కల్పించడంతో విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

చక్కగా బాలుర వసతి గృహం–2

సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతి గృహం–2లో 4 నుంచి 10వ తరగతి వరకు మొత్తం 30 మంది విద్యార్థులు ఉన్నారు. ఏడు మరుగుదొడ్లు, రెండు పెద్ద స్నానం గదులు నిర్మించారు. ఐదు నివాస గదులకు మరమ్మతులు చేసి కొత్త ఫ్యాన్‌లు ఏర్పాటు చేశారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రశాంత వాతావరణంలో ఉండేలా వసతి గృహాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. వార్డెన్‌గా ఆర్.ప్రసాదరావు విధులు నిర్వహిస్తున్నారు.

సకల సదుపాయాలతో కాలేజీ విద్యార్థుల హాస్టల్

డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ కాలేజీ బాయ్స్ హాస్టల్‌లో ఇంటర్మీడియట్ నుంచి పీజీ వరకు మొత్తం 92 మంది విద్యార్థులు ఉంటున్నారు. ఆరు గదులు, 12 మరుగుదొడ్లు, 8 స్నానం గదులు, హ్యాండ్ వాష్ బేసిన్ నిర్మించారు. నీటి సమస్య లేకుండా బోరు ఏర్పాటు చేశారు. డైనింగ్, విద్యార్థులు ఉండే ఆరు పెద్ద గదులను మౌలిక సదుపాయాలతో చక్కగా తీర్చిదిద్దారు. ఈ హాస్టల్ వార్డెన్‌గా జి.ప్రసాద్ విధులు నిర్వహిస్తున్నారు.


నూతనంగా నిర్మించిన మరుగుదొడ్లు

అన్ని సదుపాయాలు కల్పించారు



కళాశాల బాలుర వసతి గృహంలో సరైన మౌలిక సదుపాయాలు లేక చాలా రోజులుగా ఇబ్బంది పడ్డాం. ప్రభుత్వం, అధికారుల సహకారంతో హాస్టల్‌లో అన్ని సదుపాయాలు కల్పించడం ఆనందంగా ఉంది. రాబోయే రోజుల్లో మరింత మంది విద్యార్థులు వసతి గృహంలో చేరుతారు.
– మంజేటి చిన్నబాబు, డిగ్రీ ఫస్టియర్, కృష్ణా కాలేజీ

రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి


వ్యక్తి మృతదేహం

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వేస్టేషన్ సమీపంలోని సీనియర్ సెక్షన్ ఇంజినీర్, కోచింగ్ అండ్ క్రూ లాబీ భవనం వద్ద సోమవారం గుర్తు తెలియని వ్యక్తి మరణించాడు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. జీఆర్పీ సిబ్బంది తెలిపిన వివరాలిలా.. సోమవారం మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పదంగా మరణించి ఉండటాన్ని రైల్వే భద్రతా పోలీసులు గుర్తించి, గవర్నమెంట్ రైల్వే పోలీసులకు తెలియజేశారు. మృతుడి వయసు సుమారు 45–50 ఏళ్లు ఉండొచ్చు. ఎత్తు 5.3 అడుగులు, శరీరం నలుపు రంగులో ఉండి, గోధుమ రంగు నిక్కరు మాత్రమే ధరించి ఉన్నాడు. ఇతడి వద్ద ఏవిధమైన ఆధారాలు లేవని జీఆర్పీ సిబ్బంది తెలిపారు. ఈ వ్యక్తి గురించి ఎవరికైనా వివరాలు తెలిస్తే విశాఖ రైల్వేస్టేషన్‌లోని గవర్నమెంట్ రైల్వే పోలీసులకు స్వయంగా గానీ లేదా 94406 27547, 98664 13487 నంబర్లలో తెలియజేయాలని జీఆర్పీ ఎస్ఐ జి.శ్రీనివాసరావు కోరారు.